
క్లుప్తంగా

ఆకట్టుకున్న చాచా చిత్రం


మోహన్ కుంచె నుంచి జాలువారిన నెహ్రూ చిత్రం

రాయవరం: వెదురుపాకకు చెందిన చిర్రా వెంకటమోహన్ కుంచె నుంచి మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రం జాలువారింది. గులాబీ లన్నా, చిన్నారులన్నా అమితంగా ఇష్టపడే నెహ్రూ జయంతి నవంబర్ 14న కావడంతో మోహన్ వాటర్ కలర్స్‌తో ఈ చిత్రాన్ని రూపొందించారు. సోమేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మోహన్ చిత్రలేఖనాన్ని ప్రవృత్తిగా చేసుకున్నారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం

కాజులూరు: బందనపూడిలో మంగళవారం జరగనున్న వై ఏపీ నీడ్స్ జగన్ (ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి) కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు విజయవంతం చెయ్యాలని గ్రామ సర్పంచ్ దేగల తిరుమలవేణి అన్నారు. సోమవారం ఆ గ్రామంలో ఆమె మాట్లాడుతూ మధ్యాహ్నం మూడు గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్లు పాల్గొనాలన్నారు.

ఎన్నికల నాటికి బూత్ కమిటీలు


సమావేశంలో మాట్లాడుతున్న కర్రి చిట్టిబాబు

రామచంద్రపురం: రానున్న అసెంబ్లీ ఎన్నికల నాటికి బీజేపీ బూత్ కమిటీలను సిద్ధం చేయనున్నట్లు ఆ పార్టీ నాయకుడు కర్రి చిట్టిబాబు తెలిపారు. సోమవారం స్థానికంగా పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతున్న పార్టీ బలోపేతానికి శ్రేణులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. పార్టీ అసెంబ్లీ కన్వీనర్ యాండ్ర బుల్లబ్బులు, ట్రేడర్ సెల్ కన్వీనర్ కొట్టువాడ హరిబాబు, రాష్ట్ర యువజన మోర్చా నాయకుడు గానాల కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం


బలభద్రపురంలో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలో సోమవారం గడ్డి ట్రాక్టర్ దగ్ధమైంది. అనపర్తి అగ్నిమాపక అధికారి శ్రీనివాస్‌రెడ్డి కథనం ప్రకారం.. బలభద్రపురానికి చెందిన గొలుగూరి బాపిరెడ్డికి చెందిన ట్రాక్టర్‌లో గడ్డిని తీసుకువస్తుండగా విద్యుత్తు తీగలు తగలడంతో ట్రాక్టర్‌కు నిప్పంటుకుంది. స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. చివరికి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. సుమారు రూ.50 వేల నష్టం జరిగినట్లు అంచనా.

అవిడిలో విషాదం


కొత్తపేట ప్రభుత్వాస్పత్రి వద్ద సంఘటనపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: మండలంలోని అవిడిలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన దంపతుల ఆత్మహత్య ఘటన గ్రామస్తుల్లో విషాదాన్ని నింపింది. గ్రామంలోని కట్వలాంబికా కాలనీకి చెందిన పెదపూడి ఆదినారాయణ (42), అతని భార్య మంగాదేవి (35) మృతి చెందారు. డబ్బు కోసం క్షణికావేశంలో జరిగిన ఈ సంఘటనా స్థలాన్ని జిల్లా అడిషనల్ ఎస్పీ ఎస్‌కే ఖాదర్‌బాషా, ఇన్‌చార్జ్ డీఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం సీఐ రజనీకుమార్, ఎస్సై వి.మణికుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఎమ్మెల్యే జగ్గిరెడ్డి దిగ్భ్రాంతి

అవిడి గ్రామానికి చెందిన భార్యాభర్తలు మృతి చెందిన సంఘటనపై ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సమాచారంతో సోమవారం ఉదయం హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని మృతుల బంధువులను పరామర్శించారు. దహన సంస్కారాలు, ఇతర ఖర్చుల నిమిత్తం కొంత ఆర్థిక సాయం చేశారు. ఆ కుటుంబానికి ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, ఎంపీటీసీ ధూళి సూరిబాబు ఉన్నారు.

అబ్బురమునిపించేలా..

- ఆరేళ్ల ప్రాయానికే మూడు ప్రపంచ రికార్డులు
- ఔరా అనిపిస్తున్న బాల మేధావి మునికార్తీక్
- నేడు బాలల దినోత్సవం


ఇప్పటి వరకూ సాధించిన రికార్డులు, మెడల్స్, ప్రశంసా పత్రాలతో మునికార్తీక్

మండపేట: అద్భుతమైన జ్ఞాపకశక్తితో చిరుప్రాయంలోనే రామాయణ సంస్కృత శ్లోకాలు, వేమన పద్యాలను అలవోకగా వల్లే వేశాడు.. దేశ, రాష్ట్ర రాజధానులు, చిహ్నాల పేర్లను ఠక్కున చెప్పేవాడు.. ఆరేళ్ల వయసులో తనకన్నా పెద్దవారితో పోటీ పడుతున్నాడు. అలవోకగా 1.5 మీటర్ల వరకూ జంప్ చేస్తూ ఆటల్లోనూ రాణిస్తూ ఔరా అనిపిస్తున్నాడు. అతనే మండపేట మండలం వెలగతోడుకు చెందిన పెనుమర్తి మునికార్తీక్. ఆరేళ్ల వయసుకే మూడు ప్రపంచ రికార్డులు, మరెన్నో అవార్డులు, సత్కారాలు అందుకుని అబ్బురపరుస్తున్నాడు. నేడు బాలల దినోత్సవం వేళ 'సాక్షి' ప్రత్యేక కథనం .. వ్యవసాయ కుటుంబానికి చెందిన పెనుమర్తి వెంకట్రాజు, సరోజనీదేవిల కుమారుడు మునికార్తీక్. తండ్రి రైతు కాగా తల్లి డిగ్రీ పూర్తి చేసి గృహిణిగా ఉన్నారు. చిన్నతనం నుంచి కార్తీక్ చురుగ్గా ఉండేవాడు. అతని జ్ఞాపకశక్తిని ముందే గుర్తించిన తల్లి సరోజనీదేవి తెలుగు, ఇంగ్లిష్ అక్షరాలు, పదాలు రాయించడం, రామాయణం, వేమన శతకాలు నేర్పించడం చేసేవారు. మూడేళ్ల వయసులోనే దేశ, రాష్ట్ర రాజధానులు, చిహ్నాలు, తెలుగు, ఇంగ్లిష్ పదాలు, జంతువులు, శరీర భాగాలు, పండ్లు పేర్లు చెప్పినందుకు 2020 సంవత్సరంలో చాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించాడు. విజయనగరంలో ప్రముఖ రామనారాయణ ఆలయంలో జరిగిన కార్యక్రమంలో శ్రీరామచంద్రుని వంశవృక్షం, సంస్కృత శ్లోకాలు వల్లె వేసినందుకు ఆలయ కమిటీ ముని కార్తీక్‌ను ఘనంగా సత్కరించింది. నాలుగేళ్ల వయసులో 1.5 మీటర్ల లాంగ్‌జంప్ చేసినందుకు గాను 2021లో భారత టాలెంట్ బుక్ ఆఫ్ వరల్డ్ అందుకున్నాడు. మూడు నిమిషాల 30 సెకన్ల వ్యవధిలో వంద ఇంగ్లిష్ పదాలకు స్పెల్లింగులు చెప్పినందుకు గాను హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించాడు. చెస్‌లో రాణిస్తూ అబ్బుర పరుస్తున్నాడు ముని కార్తీక్. ప్రస్తుతం తన వయసు ఆరేళ్లయినా అండర్-7, అండర్-9, ఓపెన్ కేటగిరీలో సైతం తనకన్నా పెద్దవాళ్లతో తలపడుతూ ప్రతిభకు వయసుతో పని లేదని నిరూపిస్తున్నాడు. మండపేట చుట్టుపక్కలే కాకుండా విశాఖపట్నం, శ్రీకాకుళం, భీమవరంలలో జరిగిన చెస్ టోర్నమెంట్లలో పాల్గొని పతకాలు సాధించాడు. అసాధారణ ప్రతిభతో ఎన్నో వేదికలపై తన విభిన్న నైపుణ్యాలను ప్రదర్శించి ఎందరో ప్రముఖుల ప్రశంసలు అందుకున్నాడు. బాలుడి ప్రతిభను చూసి మండపేటలోని ప్రముఖ కార్పొరేట్ స్కూల్ ఫ్రీ సీట్ ఇచ్చింది. ఎల్‌కేజీ చదవకుండానే యూకేజీకి పంపించింది.

తల్లిదండ్రుల ప్రోత్సాహం

తన కుమారుడిలో ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్నారు మునికార్తీక్ తల్లిదండ్రులు. ఎక్కడ చెస్ టోర్నమెంట్ జరుగుతున్నా తమ కుమారుడిని తీసుకుని వెళ్లి పోటీలో నిలుపుతున్నారు. ప్రస్తుతం చెస్, అబాకస్‌లో శిక్షణ ఇప్పిస్తున్నట్టు తల్లి సరోజనీదేవి తెలిపారు. ఉదయం 5.30 గంటలకు మునికార్తీక్ నిద్రలేచి గంటన్నర పాటు చదువుకుని 7.30 గంటలకు స్కూల్‌కు వెళ్లిపోతాడు. తిరిగి సాయంత్రం 6.30 గంటలకు ఇంటికి వస్తాడు. కొద్దిసేపు అబాకస్ నేర్చుకుని, రాత్రి 8 గంటల నుంచి 8.30 గంటల వరకు ఆన్‌లైన్ చెస్ క్లాస్‌కు అటెండ్ అవుతాడని సరోజనిదేవి తెలిపారు. తమ కుమారుడిపై ఒత్తిడి పెరగకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. ఇతర అంశాలను పక్కన పెట్టి ప్రస్తుతం చెస్, అబాకస్‌లపై శిక్షణ ఇస్తున్నట్టు వివరించారు. భవిష్యత్తులో తమ కార్తీక్‌ను ఉన్నత స్థాయిలో చూడటమే తమ కలని సరోజనీదేవి పేర్కొన్నారు. చిన్న వయసులోనే ఎన్నో రికార్డులు సాధించిన ముని కార్తీక్ భవిష్యత్తులో మరిన్ని శిఖరాలకు చేరుకోవాలని ఆల్ ది బెస్ట్.


తనయునికి అబాకస్‌లో శిక్షణ ఇస్తున్న తల్లి సరోజనీదేవి

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం


మండల సమావేశంలో ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు తదితరులు

కపిలేశ్వరపురం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు మండల సమావేశంలో ప్రజాప్రతినిధులు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్ మాట్లాడారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి సమావేశ అజెండాను వివరించారు. శాఖల వారీగా నిర్వహించిన చర్చలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పలు సమస్యలను ప్రస్తావించారు. రెవెన్యూ, వ్యవసాయ, ఇరిగేషన్, విద్యుత్, విద్య తదితర రంగాల సమస్యలకు సంబంధిత అధికారులు వివరణ ఇచ్చారు. ప్రజాప్రతినిధులు శ్రీనివాసరావు, అబ్బు, సత్యవేణి మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. మండలంలోని గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు.

దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి

- చేస్తున్న అభివృద్ధి కనబడదా!
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆగ్రహం


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

రాయవరం: జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలను గ్రావెల్‌తో అభివృద్ధి చేస్తుంటే, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని చెల్లూరు, వెదురుపాకలో జగనన్న కాలనీలను ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తీరును తప్పుబట్టారు. జగనన్న కాలనీల్లో గ్రావెల్‌తో ఫిల్లింగ్ చేస్తున్నా అది కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కరోనా లేని సమయంలోనూ ముఖాలకు మాస్కులు పెట్టుకున్న వారితో ఎమ్మెల్యే వేగుళ్ల ప్రెస్‌మీట్ పెట్టించారన్నారు. మాస్కులు పెట్టుకుని ప్రెస్‌మీట్ పెట్టుకున్న వారిని ముసుగు వీరులుగా ఆయన అభివర్ణించారు. ఒక బోగస్ వీడియో చూపించి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారన్నారు. నియోజకవర్గంలో తిరగడానికి ఎమ్మెల్యే వేగుళ్ల సెక్యూరిటీ కోరడం విడ్డూరంగా ఉందన్నారు. తనకు నియోజకవర్గ ప్రజలే సెక్యూరిటీ అని త్రిమూర్తులు అన్నారు. కేశవరం ప్రజలను ఎమ్మెల్యే వేగుళ్ల అరాచక శక్తులుగా పోల్చడాన్ని ఆయన తప్పుబట్టారు.

అభివృద్ధే అజెండా..

నియోజకవర్గ అభివృద్ధే తన అజెండా అని త్రిమూర్తులు తెలిపారు. చెల్లూరులో 3.5 ఎకరాలు, వెదురుపాకలో 3.35 ఎకరాల్లో ఇళ్ల స్థలాలను పేదలకు అందజేశామన్నారు. లో లెవిల్స్‌లో ఉన్న జగనన్న కాలనీలను గ్రావెల్‌తో అభివృద్ధి చేసి, కాలనీల్లో రహదారులు ఏర్పాటు చేసి త్వరలోనే లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు. రైతుల విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకుని త్వరలోనే పుంత రోడ్లను అభివృద్ధి చేస్తామన్నారు. టీడీపీ హయాంలో పేదలకు ఒక్క సెంటు భూమి కూడా ఇవ్వలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇళ్ల పట్టాలతో కొత్త ఊళ్లు ఏర్పడుతున్నాయన్నారు. చెల్లూరులో 1,086 మంది లబ్ధిదారులకు, వెదురుపాకలో 140 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచులు పాలిక రాఘవ, మల్లిడి పెద్దబ్బాయ్, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ చిక్కాల శ్రీరాములు, సచివాలయ కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు సత్తి పద్దారెడ్డి, గేలం సుబ్బారాయుడు, వెలగల సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంతో మేలు జరిగింది

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తమకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని పలువురు లబ్ధిదారులు తెలిపారు. జగనన్న కాలనీల్లో పట్టాలు పొందిన లబ్ధిదారులు పెచ్చెట్టి రాజేశ్వరి, వాసంశెట్టి ధనలక్ష్మి, ఎస్.సత్యదుర్గాభవాని తదితరులు మాట్లాడుతూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఇళ్ల స్థలాలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో తమకు ఎటువంటి మేలు జరగలేదన్నారు. ప్రభుత్వం పేదలకు మేలు చేస్తుంటే ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాత్రం అభివృద్ధిని అడ్డుకోవడం పట్ల మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సంక్షేమ సారథికి అండగా నిలుద్దాం..


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, చిత్రంలో పాపారాయుడు తదితరులు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- జెడ్.మేడపాడులో గడప గడపకూ..

మండపేట: పేదల అభ్యున్నతే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా అండగా నిలవాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కోరారు. సోమవారం జెడ్.మేడపాడులో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తోరం శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు దేవు ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ తదితరులతో కలసి ఎమ్మెల్సీ గ్రామంలోని బీసీ ఏరియా, వంతెన దిగువ, పంచాయతీ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. పథకాలు అందుతున్నాయా? ఏమైనా సమస్యలున్నాయా? అంటూ స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఆయన దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారానికి ఎంపీడీఓ ఐ.రాజు, గ్రామ కార్యదర్శి అమరనాథ్ చౌదరిలకు ఆదేశాలిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ పాలనలో పనుల కోసం జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. ముడుపులు చెల్లిస్తేనే కాని పథకాలు అందేవి కావన్నారు. సీఎం జగన్ వచ్చాక వలంటీర్లు తలుపుతట్టి మరీ ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నారని ఎమ్మెల్సీ వివరించారు. మారేడుబాక సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజులు, ద్వారపూడి ఉప సర్పంచ్ తులా శేషారావు, పార్టీ నాయకులు గారపాటి అశోక్‌కుమార్, దంతులూరి శ్రీరామవర్మ, పిల్లా అరవరాజు, కొమ్మిశెట్టి నాగు, మాదిబోయిన రాంబాబు, గండిమేను శ్రీనివాస్, తీగిరెడ్డి మహేష్, కొమ్మిశెట్టి నాగు, సంగిశెట్టి మురళీ, గెద్దం గాంధీబాబు, పెందుర్తి నాని బాబు తదితరులు పాల్గొన్నారు.

కార్తికం... తేజోమయం


కోటిపల్లిలో సోమేశ్వరాలయం


కోటిపల్లిలో కొలువైన ఛాయా సోమేశ్వరస్వామి

- ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు
- ముస్తాబైన కోటిపల్లి, ద్రాక్షారామ క్షేత్రాలు

కె.గంగవరం: కార్తిక మాసం రానే వచ్చింది.. ఆధ్యాత్మిక సందడి తెచ్చింది.. మంగళవారం నుంచి ఈ మాసం ప్రారంభం కానుంది.. దీనికి గాను శైవ క్షేత్రాలు సిద్ధమయ్యాయి. మండలంలోని అముజూరు, పామర్రు, కె.గంగవరం, దంగేరు, యర్రపోతవరం, భట్లపాలిక, కుందూరు తదితర గ్రామాల్లోని శివాలయాలను ఇప్పటికే ముస్తాబు చేశారు. కోరిన కోర్కెలు నెరవేర్చే క్షేత్రంగా పేరొందిన కోటిపల్లిలోని శ్రీఛాయాసోమేశ్వరాలయం ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. గౌతమీ గోదావరి నదీ ఒడ్డున ఉన్న ఛాయాసోమేశ్వర స్వామిని కార్తిక మాసంలో అధిక సంఖ్యలో భక్తులు సందర్శిస్తుంటారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వయం భూ లింగమైన స్వామివారిని దర్శించుకుంటారు. గోదావరిలో స్నానమాచరించి సోమేశ్వరుని దర్శించుకుంటే కోటి ఫలితాలు వస్తాయని ప్రతీతి.

ఆలయ ప్రత్యేకత ఇదీ..

కోటిపల్లి క్షేత్రం అష్టసోమేశ్వర ఆలయాల్లో ఒకటి. ఇక్కడ పరమశివుడు అత్యంత చిన్న లింగాకారంలో వెలిశాడు. ఈ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి, ఛాయాసోమేశ్వరస్వామి, సిద్ధి జనార్దనస్వామి ఆలయాలు ఉన్నాయి. కార్తిక మాసంలో ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందని, దీనికి అనుగుణంగా ప్రత్యేక ఏర్పాటు చేశామని కోటిపల్లి దేవస్థానం ఈఓ శ్రీదేవి తెలిపారు. ఆలయం వద్ద క్యూలైన్లతో పాటు తాగునీరు వంటి సదుపాయాలు కల్పించామన్నారు.

కాజులూరు: కార్తిక మాసం మంగళవారం నుంచి ఆరంభం కావటంతో మండలంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. సోమవారం మధ్యాహ్నం నుంచి అమావాస్య తొలగిపోయి పాడ్యమి గడియలు వచ్చాయి.

భక్తులకు తగిన ఏర్పాట్లు



ద్రాక్షారామ క్షేత్రానికి కార్తిక మాసంలో అధిక సంఖ్యలో భక్తులు వస్తారు. భక్తుల రద్దీకి తగినట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సూచనల మేరకు ఏర్పాట్లు చేశాం. చాలా ఏళ్లుగా సమస్యగా ఉన్న అదనపు మరుగుదొడ్లు ఏర్పాటు చేశాం. భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నాం.

-పితాని తారకేశ్వరరావు, ఈఓ, ద్రాక్షారామ భీమేశ్వరస్వామి దేవస్థానం

భీమేశ్వరా... నిను కొలిచేము స్వామీ

రామచంద్రపురం రూరల్: పంచారామాల్లో ఒకటిగా, అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. కార్తిక సోమవారం రోజుల్లో ప్రత్యేకించి దాదాపు లక్ష మంది భక్తులు దర్శించుకుంటారని అంచనా. మిగిలిన రోజుల్లో సుమారు 10 వేల నుంచి 15 వేల మంది భక్తులు వస్తుంటారు. వీరికి అసౌకర్యం కలగకుండా ఆలయ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. దర్శనం సమయంలో తొక్కిసలాట జరగకుండా క్యూలైన్లు పెట్టారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకూ స్వామి దర్శనానికి అవకాశం కల్పిస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, చంటి బిడ్డల తల్లులకు శీఘ్రదర్శనం ఏర్పాటు చేశారు. సప్త గోదావరిలో స్నానాలాచరించే భక్తులు దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేక టెంట్లు వేశారు. సప్తగోదావరిలో నీరు శుభ్రం చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా జనరేటర్లు అందుబాటులో ఉంచారు. ద్రాక్షారామ పీహెచ్‌సీ సిబ్బంది సహకారంతో ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ద్రాక్షారామ పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.


ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి


భీమేశ్వరస్వామి దర్శనానికి ఏర్పాటు చేసిన క్యూ లైన్లు

దీపావళి... ఆనందకేళి


బాణసంచా కాల్చుతున్న చిన్నారి


బాణసంచా కాల్చుతున్న మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ

అంబరాన్నంటిన సంబరాలు

రాయవరం: తారాజువ్వల మెరుపులు.. కాకరపువ్వొత్తుల మిరుమిట్లు.. చిచ్చుబుడ్ల కాంతులు.. రివ్వురివ్వుమంటూ గిర్రున తిరిగే భూ చక్రాలతో నేలతల్లి రంగులమయంగా మారింది. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకొనే దీపావళి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ప్రజలు వేకువజామునే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నా, పెద్దా తారతమ్యం లేకుండా ఆదివారం రాత్రి ఆనందోత్సాహాలతో బాణసంచా కాల్చారు. రాత్రి ఆరు గంటల నుంచి ఇళ్లలో మహిళలు లక్ష్మీపూజలు చేశారు. తమ ఇంట ధనధాన్యాలు, సిరి సంపదలు కలగాలని కాంక్షిస్తూ లక్ష్మీదేవికి పూజలు చేశారు. పలువురు ఇళ్లకు విద్యుత్ దీపాలంకరణ చేశారు. దివిటీలు కొట్టిన అనంతరం బాణసంచా కాల్చారు. వెదురుపాక విజయదుర్గా పీఠంలో దీపావళి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పీఠంలో సామూహిక కుంకుమ పూజలు, లక్ష్మీపూజలు చేశారు. పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం (గాడ్) ఆధ్వర్యంలో మహిళలు లక్ష్మీ పూజలు నిర్వహించారు. విజయదుర్గా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

రామచంద్రపురం/రామచంద్రపురం రూరల్: దీపావళి సంబరాలు ఆదివారం అంబరాన్నంటాయి. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు ఆదివారం కొత్త దుస్తులు ధరించి శాస్త్రోక్తంగా పండగను జరుపుకొన్నారు. దివిటీల ఆనవాయితీ ఉన్నవారు చిన్నారులతో కలసి కొట్టారు. మందుగుండు సామగ్రి కాల్చి ఆనందాన్ని పంచుకున్నారు. దీపావళి సంబరాల్లో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పాల్గొని బాణసంచా కాల్చారు.

మండపేట: మండపేట పట్టణం, మండల గ్రామాల్లో దీపావళి పండగను ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. లక్ష్మీదేవికి పూజలు చేసి బాణసంచా కాల్చారు. స్థానిక గుమ్మిలేరు రోడ్డులోని లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాల వద్ద జోరుగా విక్రయాలు జరిగాయి. దీపావళి సందర్భంగా పట్టణంలో అయ్యప్ప స్వామివారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

కపిలేశ్వరపురం: మండలంలోని తాతపూడి, అంగర, పడమర ఖండ్రిక, అంగర, వల్లూరు, నేలటూరు, టేకి, మాచర, తదితర గ్రామాల్లో దీపావళిని సందడిగా నిర్వహించుకున్నారు. దివిటీలు కొట్టి పూజలు చేశారు.

కె.గంగవరం: మండలంలో దీపావళి పర్వదినాన్ని ఉత్సాహంగా జరుపుకొన్నారు. ఆయా గ్రామాల్లో ఆలయాల వద్ద దీపాలంకరణ ఆకట్టుకుంది.

మళ్లీ వైఎస్సార్ సీపీదే విజయం

- పార్టీ శ్రేణులు కలసికట్టుగా సాగాలి
- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీదే విజయమని, మరోసారి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడి గ్రామంలో శనివారం రాత్రి వైఎస్సార్ సీపీ శ్రేణుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. తిరిగి జగనే ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యేను సమ్మంగి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాలయ వెంకటలక్ష్మి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్, సొసైటీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కాకార సాయిబాబు, కోరా బాబి, పప్పు సింహాచలం, మీసాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


పెదపూడి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

బిక్కవోలు: కొంకుదురు శాఖా గ్రంథాలయం వద్ద 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను సర్పంచ్ సత్తి వీరమణి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య పుట్టిన గ్రామం ఇదే కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇక్కడ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు ఈ నెల 14 నుంచి 20 వరకూ వివిధ పోటీలు నిర్వహిస్తామన్నారు. 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులను స్మరించడం, 17న కవి సమ్మేళనం, 18న చిత్ర లేఖనం, రచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు, 19న దిశ చట్టం, మహిళా సాధికారతపై అవగాహన, 20న డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన, విద్యార్థులకు బహుమతులు, ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. కొంకుదురు ఎంపీటీసీ సభ్యుడు పీవీ, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి, శాఖా గ్రంథాలయ అధికారి నందికోళ్ల బాల తదితరులు పాల్గొన్నారు.